చల్లంగా చూడు ముత్యమాంబ

- ఘనంగా తొలేళ్ల సంబరం
- నేడు ప్రధాన పండగ
- ముస్తాబైన అమ్మవారి ఆలయం



తొలేళ్ల సంబరంలో ఘటాలు ఊరేగిస్తున్న సంఘు ప్రతినిధులు





అక్కయ్యపాలెంలో కొలువైన ముత్యమాంబ అమ్మవారు, విద్యుద్దీపాల కాంతుల్లో ఆలయ ప్రాంతం

సీతంపేట: భక్తులను కాచి కాపాడే అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ పండగ మహోత్సవానికి వేళాయింది. పార్వతీ దేవి ప్రతిరూపంగా గ్రామాలకు రక్షణగా అమ్మవార్లను ఊరి పొలిమేరల్లో ప్రతిష్ఠించేవారు.

కాలక్రమేణ గ్రామాలు పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. ఒకప్పటి పొలిమేరలు నగరంలో ప్రధాన కేంద్రాలుగా మరాయి. మనిషి ఆధునికంగా మారినా ప్రాచీన సంప్రదాయాలు, సంస్కృతులను వీడలేదు. పూర్వీకులు ఇచ్చిన నమ్మకాన్ని, సంస్కృతీ, సంప్రదాయాలను ఇప్పటి తరాలు కొనసాగిస్తున్నాయి. భావితరాలకు వాటిని అందజేసేలా ఏటా అమ్మవారి జాతరలు అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారు.

గ్రామ దేవతల చరిత్ర

అక్కయ్యపాలెంలో సుమారు 200 ఏళ్ల కిందట భూలోకమాత, ముత్యమాంబ, కుంచుమాంబ గ్రామ దేవతలను ప్రతిష్ఠించారని స్థానికులు చెబుతున్నారు. గ్రామ రక్షణకు, వ్యాధులు ప్రబలకుండా అప్పట్లో గ్రామంలో నివసించే గవర కులస్తులు, పెద్దలు ఒక కమ్మల పాకలో అమ్మవార్లను ప్రతిష్ఠించారు. ఆ తర్వాత తరం వారు గానుగ సున్నంతో పెద్ద దిమ్మ నిర్మించి వేప కర్రలతో అమ్మవారి రూపాలను ప్రతిష్ఠించారు. కాలక్రమేణా గవర కులస్తులంతా కలిసి గుడిని నిర్మించగా.. గ్రామస్తులు గౌరీ సేవా సంఘంగా ఏర్పడి అమ్మవారి ఆలయాలను మరింత అభివృద్ధి చేశారు. ముగ్గురమ్మవార్లను ప్రతిష్ఠించి నిత్య పూజలు జరిపిస్తున్నారు. ప్రతి ఏటా ఒక అమ్మవారికి గ్రామస్తులంతా పెద్ద ఎత్తున పండగను జాతరలా నిర్వహిస్తున్నారు.

అక్కయ్యపాలెంలో భారీ ఏర్పాట్లు

ఈ ఏడాది ముత్యమాంబ పండగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గౌరీ సేవా సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఘనంగా ఏర్పాట్లు చేశారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, జగన్నాథపురం, 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్, రామాలయం, కర్రివాని బ్రిడ్జి, జగ్గారావు బ్రిడ్జి రహదారులన్నీ విద్యుత్ దీపాలు, ఎల్ఈడీ ఫ్లెక్సీలతో అలంకరించారు. ఆలయం వద్ద షామియానాలు, కొబ్బరి ఆకులతో చలువ పందిర్లు సిద్ధం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎవరికీ ఏ ఇబ్బంది తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ మాట్లాడుతూ సోమవారం అమ్మవారి తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించామని, మంగళవారం ప్రధాన పండగకు భారీ ఏర్పాట్లు చేశామని, అంగరంగ వైభవంగా జరుపుతామని తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి జల, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తామని, ఉదయం నుంచే అమ్మవారికి మొక్కులు సమర్పించుకోవచ్చని చెప్పారు. సాయంత్రం ఆర్కెస్ట్రా, బుర్రకథలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి స్టేజ్ ప్రోగ్రామ్స్ ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు పరస, సాము గరిడీలు, పులివేషాలు, కోలాటం, తప్పిటగుళ్లు, తీన్‌మార్, నవదుర్గల అవతారాలు వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. భక్తులంతా విచ్చేసి పండగను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సంఘ గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి అడారి పారుపల్లి రవి, డిప్యూటీ ప్రెసిడెంట్ పిల్లా ఫకీర్‌నాయుడు, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారికి కిరీటం బహూకరణ



కిరీటం బహూకరిస్తున్న దాతలు

సీతంపేట: అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ పండగ సందర్భంగా అమ్మవారికి కిరీటం బహూకరించారు. గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, జాయింట్ సెక్రటరీ యల్లపు కోటేశ్వరరావు తమ సొంత నిధులతో రూపొందించిన కిరీటాన్ని సంఘం అధ్యక్షులు కొయిలాడ వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు.

క్లుప్తంగా

'స్పందన'కు 15 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'కు వినతులు

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందించారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 14, 24 వార్డుల కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, పలువురు వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూకు 01, ఇంజినీరింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

కీర్తి పట్నాయక్‌కు సత్కారం



కీర్తి పట్నాయక్‌ను సత్కరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఇరవై ఏళ్లుగా సొంత నిధులతో విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కీర్తి పట్నాయక్‌కు గుంటూరు జిల్లా రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆమెను ఘనంగా సత్కరించారు. మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. 14, 24 వార్డుల కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సావిత్రమ్మ

సీతమ్మధార: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. శ్రీకాకుళం టౌన్ గుర్రిల్ల వారి మేడ ప్రాంతానికి చెందిన సతివాడ సావిత్రమ్మ అనే వృద్ధురాలు అక్కయ్యపాలెం లలితానగర్‌లో ఉంటున్న కుమార్తె జానకి ఇంటికి శనివారం వచ్చింది. కొంత కాలంగా ఆమె జ్ఞాపకశక్తి కోల్పోయి ఇబ్బంది పడుతోంది. కుటుంబ సభ్యులు నిద్రపోతున్న సమయంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఉదయం నిద్ర లేచిన తర్వాత చూసేటప్పటికీ సావిత్రమ్మ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఇళ్లకు వెళ్లి అడిగి, పలు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సావిత్రమ్మ అల్లుడు పైడిరాజు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటరావు ఆదేశాల మేరకు హెచ్‌సీ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సావిత్రమ్మ ఆచూకీ తెలిసినట్లయితే 90140 61478 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

48వ వార్డులో అభివృద్ధి పనులు



శివలింగపురంలో కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు న్యూశ్రీనివాసనగర్, శివలింగపురం కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గంకల కవితతో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.08 కోట్లతో రిటైనింగ్ వాల్, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెట్ల మార్గాలు నిర్మించనున్నట్లు జోన్-5 డీఈ భరణికుమార్ తెలిపారు. పనులు జరుగుతున్న సమయాల్లో అధికారులు పర్యవేక్షించాలని కె.కె.రాజు సూచించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని కాంట్రాక్టర్లకు కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఏఈ అర్చన, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, బీజేపీ నాయకుడు గంకల అప్పారావు, పార్టీ నాయకులు వసంతల అప్పారావు, రత్తల రాంబాబు, జాగరపు అప్పారావు, నరేష్, రామునాయుడు, పార్వతి, శ్రీను, ఉమా, భాను, నాగేశ్వరరావు, నాయుడు, ప్రశాంత్, హేమంత్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: 60 అడుగుల గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ అధికారులు సోమవారం ఈ రోడ్డును పరిశీలించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో మారియట్ హోటల్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు 60 అడుగుల రోడ్డు విస్తీర్ణం చేయనున్నారని, అందులో భాగంగా మారియట్ హోటల్ నుంచి 51వ వార్డు బౌండరీ వరకు సుమారు రూ.5 కోట్లు మంజూరయ్యాయని కార్పొరేటర్ చెప్పారు. ఈ నేపథ్యంలో డీఈ వర్మ, ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ గుప్తా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి కలిసి రోడ్డును పరిశీలించారు. వచ్చే నెలలో గిరిప్రదక్షిణ పూర్తయిన అనంతరం రోడ్డు విస్తీర్ణ పనులు మొదలుపెడతారని తెలిపారు. ఈ రోడ్డు జాతీయ రహదారికి సమానంగా నగరంలోకి వెళ్లడానికి వీలుగా ఉన్న కారణంగా ఈ రహదారికి విభాగిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ సూచించారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, పార్టీ నాయకులు రమేష్, శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-5 ఏసీపీగా రఘునాథ్



కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా రఘునాథ్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వుల మేరకు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్‌ను జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అభినందించారు. ఏసీపీ రఘునాథ్ మాట్లాడుతూ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. ఇళ్లు నిర్మించే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

నాణ్యమైన విద్యే సీఎం ధ్యేయం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తింటున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సందర్శించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో వార్డు నాయకులు, హెచ్‌ఎంతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని కె.కె.రాజు అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకుని మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అనంతరం ఇదే ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో. మధ్యాహ్న భోజనాన్ని కె.కె.రాజు పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. ఏ లోటు లేకుండా లబ్ధిదారులకు పథకాలు అందజేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి ఆయన తిన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, షేక్ జుబేర్, ఎస్.ప్రసాదరావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, వెంకటేష్, సూర్యనారాయణ, సురేందర్‌లాల్, శివ, రమణమూర్తి, అక్బర్, సుల్తాన్, చందన్‌సాయి, కృష్ణవేణి, గీత, కనకమహాలక్ష్మి, బ్రహ్మాజి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షానికి పొంగిన గెడ్డ

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు వంశీనగర్‌లోని గెడ్డ ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పొంగి ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. అక్కడ ఉన్న ఓ కారు గెడ్డలోకి కొట్టుకుపోయింది. స్థానికులు ఈ విషయాన్ని సోమవారం ఉదయం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే గెడ్డ వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. జీవీఎంసీ శానిటేషన్ అధికారులను పిలిపించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గెడ్డకు సంబంధించిన రిటైనింగ్ వాల్, బాటం కాంక్రీట్ పనులు కూడా చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ చిరంజీవి, సెక్రటరీ రేష్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఈవ్‌టీజర్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో ఒక యువతిని ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కయ్యపాలేనికి చెందిన యువతిని కొద్ది రోజులుగా ఈవ్‌టీజింగ్ చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కప్పరాడ, రాంజీ ఎస్టేట్ ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కామేశ్వరి, వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, కృపా, నాగరాజు, సాయి, సురేష్, జయకుమార్. గురువులు, అజయ్, శ్రీను, షేక్ బాబ్జి, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంచకర్లను కలిసిన పైడి రమణ



ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన పైడి రమణ సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. - తాటిచెట్లపాలెం

వారాహి నవరాత్రులు ప్రారంభం





వారాహి దేవికి అభిషేకం చేస్తున్న అర్చకులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుక్ల పాడ్యమి నుంచి నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వారాహిదేవికి సోమవారం సాయంత్రం సహస్రనామార్చన చేశారు. అమ్మవారిని అలంకరించి దూప దీప నైవేద్యం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహి దేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, భూసంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులను సత్కరిస్తున్న సారిపిల్లి గోవింద్



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీ నరస

- స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్
- 'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు, మెడల్స్ అందజేశారు. 556 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిన ఎస్.భోగేష్‌కు మొదటి బహుమతిగా రూ.3 వేలు నగదు, బంగారు పతకం, ప్రశంసాపత్రంతో సత్కరించారు. 549 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన ఐ.స్పందనకు రెండో బహుమతిగా రూ.2 వేలు నగదు, ప్రసంశాపత్రం, మెడల్, 527 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన కె.రోషిణి, పి.గాయత్రిలకు మూడో బహుమతిగా రూ.వెయ్యి చొప్పున నగదు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ పటిష్ఠంగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సురేష్, హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం దేముడుబాబు, ఎడ్యుకేషన్ సెక్రటరీ జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీజీవోస్ కాలనీ ఉన్నత పాఠశాలలో..

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు.

పదో తరగతి ఫలితాల్లో 530 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కొసనం వాసవి శ్రీజకు రూ.3 వేల నగదు, 520 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన నొడగల మమతకు రూ.2 వేల నగదు, 506 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన అన్వర్ ఆలీరజాకు రూ.వెయ్యి నగదు బహుమతి, మెడల్స్, ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ నరస చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, జ్యోతి, లలిత, మాణిక్యం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు ఉపయోగించుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన జన్ భాగిదరి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్ డెవలప్మెంట్ కార్నర్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల ఆవశ్యకతపై అవగాహన పెంపొందించడానికి జన్ భాగిదరి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

ఐసీడీఎస్ మద్దిపాలెం ప్రాజెక్ట్ సెక్టర్-2 సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి జన్ భాగిదరి ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రీ-స్కూల్ కార్యక్రమాలు పిల్లల సమగ్రాభివృద్ధికి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, సచివాలయ మహిళా పోలీస్ వరలక్ష్మి, ఏఎన్ఎం స్రవంతి, ఆశ వర్కర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డివిడెండ్ల ప్రకటన హర్షణీయం



మాట్లాడుతున్న జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ పోరాటాల ఫలితంగా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డివిడెండ్లు ప్రకటించడం హర్షణీయమని శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మిగిలిన సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఆర్ఎం ఆఫీస్ వెనుక గల ప్రేమ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఈ వివరాలు వెల్లడించారు. ముఖ్య అతిథి జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్‌లో జరుగుతున్న అవకతవకలపై ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నిరంతర పోరాడిందని, దాని ఫలితంగానే డివిడెండ్లు ప్రకటించారన్నారు. డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళీశ్వరరావు మాట్లాడుతూ శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్.సి.సాహూ ఆధ్వర్యంలో మూడు డివిజన్లలో చేసిన ఒత్తిడి, పోరాటాల వల్ల డివిడెండ్లు సాధించామన్నారు. పదవీ విరమణ, స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన, మరణించిన వారికి రావాల్సిన డివిడెండ్లపై వెంటనే అర్బన్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానంతరం షేర్ హోల్డర్స్‌తో కలిసి ర్యాలీగా బ్యాంకు వద్దకు చేరుకుని, నాయకులు బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్(సెంట్రల్) తమ్మినేని నరసింగరావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ బి.సత్యనారాయణ, జాయింట్ జనరల్ సెక్రటరీ ఎ.వి.రావు, ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఆర్.ఎం.పాత్రో, ఎం.వి.పాపారావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు చలసాని గాంధీ, అధిక సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై సీపీఎం నిరసన



సీఎండీ పృథ్వీ తేజ్‌కు వినతిపత్రం అందిస్తున్న జగ్గునాయుడు

సీతమ్మధార: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద సీపీఎం మద్దిలపాలెం, అక్కయ్యపాలెం జోన్ కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ గృహ వినియోగదారులకు, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతి కనెక్షన్‌కు అయ్యే ఖర్చు రూ.13 వేలని, దీని కాంట్రాక్టును ఆదానీ కంపెనీకి ఇస్తున్నారన్నారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, జీవీఎస్, చలపతి, బి.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో..

మురళీనగర్: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పైడిమాంబ గుడి సమీపం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయకపోతే పోరాటానికి ప్రజల సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం వీరు డీఈకు వినతిపత్రం అందించారు. జోన్ నాయకులు ఎస్.సోమేశ్వరరావు, ఎం.ఈశ్వరరావు, ఒ.అప్పారావు, పి. వెంకటరావు, ఎ.పుష్ప, ఎ.మోహన్ రావు, నరసింగరావు, కె.సుధాకర్, కల్యాణి, శారద, సీహెచ్.సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.